# కరెంట్ అఫైర్స్

## 2020 నుంచి బీఎస్-6 వాహనాలు

★ దేశంలో వాయు కాలుష్యం నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు 2018, అక్టోబరు 24న కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలో 2020, ఏప్రిల్ 1 నుంచి భారత్ స్టేజ్ (బీఎస్–4) వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్ నిలిపి వేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అదే తేదీ నుంచి దేశవ్యాప్తంగా బీఎస్–6 ప్రమాణాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

★ 2017, ఏప్రిల్ 1 నుంచి బీఎస్–4 ఉద్గార ప్రమాణాలు అమల్లోకి వచ్చాయి. కాగా, బీఎస్–5 వదిలి 2020 నుంచి నేరుగా బీఎస్–6 ఉద్గార ప్రమాణాలను అమలు చేయనున్నట్లు 2016 లోనే కేంద్రం ప్రకటించింది.

★ మోటారు వాహనాలు విడిచే పొగ కారణంగా వాతావరణంపై పడే దుష్ప్రభావాన్ని, కాలుష్య స్థాయిని నియంత్రించే ఉద్దేశంతో భారత్ స్టేజ్ (బీఎస్) ఉద్గార నిబంధనలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

## లైంగిక వేధింపుల నిరోధంపై బృందం

★ పనిచేసే చోట మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా చూడటం, ఇందుకుగాను ప్రస్తుతం ఉన్న చట్టాలను మరింత పకడ్బందీగా అమలు చేయడం, ఇంకా ఏమైనా చర్యలు తీసుకోవాలా అనేదానిపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం 2018, అక్టోబరు 24న హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో కేంద్ర మంత్రుల బృందాన్ని (జీవోఎం) నియమించింది.

★ ఇందులో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ, ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీ సభ్యులు.

★ అన్ని వర్గాలను సంప్రదించి లైంగిక వేధింపుల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై మూడు నెలల్లోగా జీవోఎం కేంద్రానికి నివేదికను సమర్పిస్తుంది.

## సియోల్ శాంతి బహుమతి

★ 2018 సంవత్సరానికి గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మక సియోల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ సహకారం, ప్రపంచ ఆర్థికాభివృద్ధికి చేసిన అత్యున్నత సేవలకుగానూ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

★ 'మోదీనామిక్స్' ద్వారా భారత్‌తోపాటు ప్రపంచ ఆర్థికాభివృద్ధి కోసం, ప్రపంచ శాంతి, భారత్‌లో మానవాభివృద్ధి, ప్రజాస్వామ్యాన్ని కొనసాగిస్తూ మోదీ విశేష సేవలు అందిస్తున్నారు. పేద, ధనిక వర్గాల ప్రజల మధ్య నెలకొన్న సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించేందుకు కృషి చేస్తున్నందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సియోల్ శాంతి పురస్కార కమిటీ ప్రకటించింది.

★ 1990లో సియోల్‌లో నిర్వహించిన 24వ ఒలింపిక్స్ విజయవంతమైన సందర్భంగా సియోల్ శాంతి బహుమతిని నెలకొల్పారు. ప్రతి రెండేళ్లకోసారి ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు.

★ 1990లో ఈ పురస్కారాన్ని తొలిసారిగా జువాన్ ఆంటోనియో సమరాంచ్ (స్పెయిన్, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ 7వ అధ్యక్షుడు)కు ప్రదానం చేశారు. 1994లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయలేదు. ఐరాస ప్రధాన కార్యదర్శులుగా పనిచేసిన కోఫీఅన్నన్ (1998), బాన్ కీ మూన్ (2012) లాంటి ప్రముఖులతోపాటు జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ (2014) కూడా ఈ పురస్కారాన్ని పొందారు.

★ 2 లక్షల అమెరికన్ డాలర్ల విలువ గల ఈ పురస్కారాన్ని గెలుచుకున్నవారిలో మోదీ 14వవారు. 2016లో ఈ పురస్కారాన్ని పొందిన కాంగో వైద్యుడు డెనిస్ ముక్వెగె తాజాగా 2018లో నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు.

## సీబీఐ తాత్కాలిక డైరెక్టర్

★ కేంద్ర ప్రభుత్వం 2018, అక్టోబరు 24న సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నెం నాగేశ్వరరావును నియమించింది. ఈయన జయశంకర భూపాలపల్లి జిల్లా, మంగపేట మండలం, బోరు నర్సాపురం ఏజెన్సీ గ్రామానికి చెందిన 1986 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐపీఎస్ అధికారి.





www.eenadupratibha.net

★ 55 ఏళ్ల సీబీఐ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కుమ్ములాటలకు దిగిన సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాను సెలవులపై పంపించింది.

## నూతన ప్రధాన న్యాయమూర్తులు

★ 2018, అక్టోబరు 24న దేశంలో అయిదు హైకోర్టులకు నూతన ప్రధాన న్యామూర్తులను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొలీజియం సిఫారసు మేరకు వీరిని నియమిస్తున్నట్లు ప్రకటించింది.

★ బొంబాయి హైకోర్టుకు జస్టిస్ నరేష్ హరీష్‌చంద్ర పాటిల్, ఉత్తరాఖండ్ హైకోర్టుకు జస్టిస్ రమేష్ రంగనాథన్, గువాహటి హైకోర్టుకు జస్టిస్ అజికుట్టిరా సోమయ్య బోపన్న, సిక్కిం హైకోర్టుకు జస్టిస్ విజయకుమార్ బిస్త్, కోల్‌కతా హైకోర్టుకు జస్టిస్ దేబాశిష్‌కర్ గుప్తాలు ప్రధాన న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

★ ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ రమేష్ రంగనాథన్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన 2016, జులై 30 నుంచి 2018, జులై 6 వరకు ఉమ్మడి హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించారు.

## అత్యంత పొడవైన వంతెన

★ ప్రపంచంలోనే అత్యంత పొడవైన సముద్ర వంతెనగా గుర్తింపు పొందిన హాంకాంగ్-జుహాయిని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2018, అక్టోబరు 23న ప్రారంభించారు. 55 కి.మీ. పొడవైన ఈ వంతెన ప్రపంచంలోనే స్టీల్‌తో నిర్మించిన అతిపెద్ద వంతెన. ఆర్థికాభివృద్ధిని పరుగులెత్తించడమే లక్ష్యంగా హాంకాంగ్ మకావులతోపాటు జుహాయి నగరాల మధ్య రోడ్డు రవాణాను పెంపొందించడానికి చైనా ఈ వంతెనను నిర్మించింది. హాంకాంగ్, మకావుల మధ్య ప్రవహిస్తున్న పెర్ల్ నది ముఖ ద్వారానికి ఈ వంతెనను అనుసంధానం చేశారు. ప్రస్తుతం హాంకాంగ్ నుంచి జుహాయికి ప్రయాణ సమయం 3 గంటలు, ఈ వంతెన నిర్మాణం వల్ల అది 30 నిమిషాలకు తగ్గనుంది.

## జాతీయ పోలీసు స్మారకం

2018, అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దిల్లీలోని చాణక్యపురిలో పోలీసు స్మారక కేంద్రంలో జాతీయ పోలీసు స్మారకాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు.

★ ఈ స్మారక చిహ్నాన్ని 31 అడుగుల పొడవు, 9 అడుగుల వెడల్పుతో 270 మెట్రిక్ టన్నుల బరువైన ముడి గ్రానైట్ రాయితో రూపొందించారు. ఈ రాయిని ఖమ్మం జిల్లా, నేల కొండపల్లి మండలం, చెరువు మాదారంలోని క్వారీ నుంచి సేకరించారు.

## బాణసంచా 2 గంటలే

★ దీపావళి పండుగ రోజు భారీగా విస్తరించే వాయు కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో 2018, అక్టోబరు 23న సుప్రీంకోర్టు కొన్ని ఆదేశాలు, మరికొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది.

★ దేశంలో టపాసుల క్రయ విక్రయాలను నిషేధించే అంశంపై సుప్రీంకోర్టు సమతూకాన్ని పాటిస్తూ తీర్పు వెలువరించింది. టపాసుల తయారీదారుల పొట్టకొట్టకుండానే పౌరుల ఆరోగ్యాన్ని పరిరక్షించేలా నిర్ణయం వెలువరించింది. పర్యావరణానికి నష్టం కలిగించే టపాసులను నిషేధిస్తూ, తక్కువ కాలుష్యం కలిగించే బాణసంచా (గ్రీన్ క్రాకరీ)ను మాత్రమే వినియోగించుకునేందుకు ప్రజలకు అనుమతిచ్చింది.

★ దీపావళి నాడు రోజంతా కాకుండా రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు అంటే కేవలం రెండు గంటల పాటే టపాసులు కాల్చేందుకు అనుమతినిచ్చింది. క్రిస్మస్, న్యూఇయర్‌లు అర్ధరాత్రి పండుగలు కాబట్టి ఆ రోజుల్లో రాత్రి 11.55 నుంచి 12.30 వరకు 35 నిమిషాల పాటు బాంబుల మోత మోగించవచ్చని పేర్కొంది.

★ తీవ్ర శబ్దం, వాయు కాలుష్యం కలిగించే థౌజండ్ వాలాలు, లడీల లాంటి టపాసులను కోర్టు నిషేధించింది.

## అమెరికా ఫెర్క్ అధిపతిగా నీల్ ఛటర్జీ

★ అమెరికా ఫెడరల్ ఇంధన నియంత్రణ కమిషన్ (ఫెడరల్ ఎనర్జీ రెగ్యులేటరీ కమిషన్–ఫెర్క్) ఛైర్మన్‌గా భారత సంతతికి చెందిన నీల్ ఛటర్జీని 2018, అక్టోబరు 25న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించారు. అక్టోబరు 22న అనారోగ్య కారణాల

రీత్యా ఛైర్మన్ పదవి నుంచి వైదొలగిన కెవిన్ మైక్ స్థానంలో  ఫెర్క్ కమిషనర్‌గా ఉన్న నీల్ ఛటర్జీని నియమించారు.

**ఆజాద్ హింద్ 75వ వార్షికోత్సవం**

★ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ సర్కార్ 75వ వార్షికోత్సవాన్ని 2018, అక్టోబరు 21న నిర్వహించారు. 1943, అక్టోబరు 21న నేతాజీ ఆజాద్ హింద్ సర్కార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఎర్రకోట వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులను విచారించిన ఎర్రకోటలోని మూడో నంబరు బ్యారక్‌ను మోదీ సందర్శించారు.

**విరాట్ కోహ్లీ @ 10 వేల పరుగులు**

★ 2018, అక్టోబరు 24న టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్‌లో 10 వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. విశాఖపట్నంలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 81 పరుగుల వద్ద విరాట్ ఈ ఘనతను సాధించాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ 157 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.  వన్డే క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా (213 మ్యాచ్‌లు, 205 ఇన్నింగ్స్) ఈ ఘనత సాధించిన కోహ్లీ, తెందూల్కర్ రికార్డు (266 మ్యాచ్‌లు, 259 ఇన్నింగ్స్)ను అధిగమించాడు.

**ప్రత్యేక యాప్**

★ దివ్యాంగులు సులభంగా ఓటు వేసేందుకు హైదరాబాద్ మహానగర పాలక సంస్థ రూపొందించిన 'వాదా' యాప్‌ను కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ ఓపీ రావత్ 2018, అక్టోబరు 23న హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.

★ వాదా (ఓటర్ యాక్సెసబిలిటీ యాప్ ఫర్ ది డిఫరెంట్లీ ఏబుల్డ్) యాప్ దివ్యాంగులు సులభంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటువేసి తిరిగి తమ ఇళ్లకు చేరుకోవడంలో సాయపడుతుందని రావత్ వెల్లడించారు.

★ ఈ యాప్ టెక్స్ట్, వాయిస్, జీపీఎస్ వ్యవస్థతో ఉంటుంది. దేశంలోనే ఈ తరహా యాప్‌ను తొలిసారిగా దివ్యాంగుల కోసం అందుబాటులోకి తెచ్చారు.

**రచయిత: సీహెచ్. కృష్ణ ప్రసాద్**

www.eenadupratibha.net